# బ్రాహ్మణరెడ్డిగారి తమ్ముడు సుబ్బారెడ్డిగారు...

మనిషెంత అందమో మాటకూడా అంతే అందం. మనసు ఈ రెండింటికంటే మాగొప్ప అందం.

సుబ్బారెడ్డిని ఎప్పట్నుంచో తెల్సినవాళ్ళు సుబ్బాడ్డి అని కొత్తోళ్ళు చింతా బ్రాహ్మణరెడ్డిగారి తమ్ముడు సుబ్బారెడ్డిగారు అని అంటారు.

అయితే ఒక అలవాటుంది సుబ్బాడ్డికి. అది పొద్దున్నే పక్కమీంచి లేచిన దగ్గర్నుంచీ షోగ్గా తయారయ్యి బయటికి రాడానికి కనీసం రెండుగంటలు పడద్ది. అంతా అయ్యేకా పానితో పక్క పాపిడి తీసుకుని నున్నగా క్రాపు దువ్వుకోడానికి పావుగంట పడద్ది. అలాగ తయారయ్యాకాగానీ రామచంద్ర పురం రాజుగారి కోటలాంటి వాళ్ళ మేడ మెట్లు దిగి బయటికి రాడు.

* * *

కొత్త పెర్గ్యూసన్ ట్రాక్టరు దాని వెనకాల తొట్టీకొన్న సత్యానందంతో వాళ్ళనాన్న బ్రాకెట్టు ఆదిరెడ్డిగారు ''మనోళ్ళందరినీ తీసుకుని తలుపులమ్మలోవలో కెళ్ళి మేకపోతుని బలేసిరండి'' అన్నాడు.

దాంతో ఊళ్ళో తనకి కావల్సినోళ్ళందర్ని పిలుస్తా చింతా బ్రాహ్మణరెడ్డి దగ్గరకీ సుబ్బారెడ్డి దగ్గరకీ వెళ్ళి''తెల్లవారుఝామునే బయల్దేరుతున్నాం మీరిద్దరూ వచ్చి తీరాలి తప్పదు'' అన్నాడు.

''ట్రాక్టరెనక తొట్లో కూర్చుని అంత దూరం ఎవడొస్తాడు వెళ్ళెహె'' అన్నాడు చింతా బ్రాహ్మణరెడ్డి.

''బాబ్బాబు అలా అనొద్దు తొట్టిలో మీకోసం పరుపు లేయిస్తాను గందా'' అని బతిమాలి ఒప్పించేడు సత్యానందం.

తెల్లారగట్టే ట్రాక్టరు ట్రక్కు వెనకాల అందరూ ఎక్కేసరికి మొత్తం నిండిపోయింది.


రామచంద్రపురం నుంచి వేళంగీ కరపా దాటుకుంటా కాకినాడ వచ్చేక ఓల్గా హొటలు దగ్గర ట్రాక్టరు ఆపి ''కాఫీలు తాగేసి బయల్దేరదాం'' అన్నాడు సత్యానందం.

నాకయితే ఆకలేస్తుంది అన్నాడు బ్రహ్మణరెడ్డిగారి తమ్ముడు సుబ్బారెడ్డి ''సరే పదండంటే పదండి'' అనుకుంటా లోపలికెళ్ళేరు.

పొద్దున్నే వేడి వేడి సాంబారు ఇడ్లీలు తిని మసాలా దోశ తిని కాఫీ తాగిన సుబ్బారెడ్డి ట్రాక్టరు తొట్టిలో వేసిన పరుపు మీద కూర్చున్నాడు.

పిఠాపురం, గొల్లప్రోలూ, కత్తిపూడి జంక్షను దాటుకుంటా అన్నవరం వచ్చేక ''టీలు తాగుదాం'' అన్నాడు బ్రాహ్మణరెడ్డి.

సత్యన్నారాయణస్వామి మెట్ల దగ్గర కొబ్బరికాయ కొట్టొచ్చిన సుబ్బారెడ్డి ప్రసాదం పొట్లం కొనుక్కొని తింటా హొటల్లో కొచ్చి పూరీ,



ఉప్మా పెసరట్టూ తిని టీ తాగుతుంటుంటే సుబ్బారెడ్డి కేసే చూస్తా ఉండిపోయేడు సత్తి సూర్యనారాయణగారి చిట్టి.

అన్నవరం దాటి తుని రూట్లో వెళ్తుంటే ఎడమ పక్కన ఎర్ర కంకర దారి కనిపిస్తది. ఆ సైడుకి మళ్ళీ గతుకుల దారమ్మట ముందుకెళ్తే వెలమకొత్తూరు అనే తాటాకు పాకలున్న వూరు తగులుద్ది. ఆ వూర్నిండా వెలమలుంటారు. అది దాటుకుని ముందుకెళ్తుంటే కంకరదారికి ఎడాపెడా అంటుమామిడీ జీడిమామిడీ కలగల్సిన తోటలు ఆ తోటల మధ్య కల్లుకుండలు గట్టిన పొడుగాటి తాడిచెట్లు ఇంకా ముందుకెళితే లోవకొత్తూరు. మామూలు ఇళ్ళతో పాటు రాజుల ఇళ్ళుకూడా ఉన్నాయంట ఆ వూళ్ళో. ఆడోళ్ళు గుంపులు గుంపులు కింద వచ్చేసి "వంటలు చేస్తావండి వంటలూ" అంటా ట్రాక్టర్ని ఆపేసేసరికి నల్లటి ఓ ఆడపిల్లని "అలాగే ఎక్కు" అని ట్రక్కులోకి ఎక్కించుకున్నాడు సత్యానందం.

ఆ వూరు దాటి ముందుకెళితే సింగిల్ కంకర్రోడ్డున్న కొండ. అదెక్కితే ఎత్తయిన కొండపైపైకి మెట్లు. ఆ మెట్ల లోపల గుహలో తలుపులమ్మవారు. చెక్కబొమ్మ. కాస్తలావుగా ఉన్నోళ్ళు పైకెక్కలేరు.

సత్యానందం సుబ్బారెడ్డిలాంటి కుర్రోళ్ళంతా పైకెక్కేరు. కూడా తీసుకొచ్చిన మేకపోతుని అమ్మోరికి బలేసి దణ్ణపెట్టుకుని కిందకి

దిగేక ఆ వంటలపిల్ల ''మసాలాలూ వంటపాత్రలూ మాయేనండి'' వాటికి ఇంత అని బేరమాడుకుని మొదలెట్టింది వంటలు.

అలవాటున్న జనం అక్కడ దొరికిన సారా కల్లు తెచ్చుకు తాగుతున్నారు. సుబ్బారెడ్డి కివ్వబోతే నాకు అసహ్యం అని ఓ గంట గడిచేక ఆకలేస్తుంది అనేసరికి సుబ్బారెడ్డి కేసి అదోలాగ చూసేడు మల్లిడిగంగిరెడ్డి.



నల్లటి ఆ వంటలమ్మాయి మేకమాంసంతో పలావు వండింది. ఇగురూ వేపుడూ చేసి దుమ్ములతో చారు కాసింది. చిక్కటి నీడ నిచ్చే చింత చెట్లకింద విస్తరాకు లేసి వడ్డిస్తుంటే అందరిమధ్యలో కూర్చున్న సత్యానందం ''మనోళ్ళందరికీ ఇది తెల్సు అయినా చెపుతున్నానోరేయ్... ఈ తలుపులమ్మ లోవలో కొస్తే ఇక్కడ వండు కున్నది ఏదీ మిగల్చ కుండా ఇక్కడే తినేసి సందలడేలోగా కొండ దిగేసి వెళ్ళిపోవాలి... తెల్సుగదా?'' అన్నాడు.

ఆ వంటలపిల్ల వడ్డిస్తుంటే ఆగుంపులో అందరికంటే ఎక్కువ వేయించుకుతిని దూరంగా ఉన్న ఇంకో పెద్ద చింత చెట్టుకింద కెళ్ళి హాయిగా నిద్రపోయాడు సుబ్బారెడ్డి.

''చీకటిపడ్డాకా ఈలోవలో ఉండకూడదంట రండి అబ్బాయిగారూ'' అంటా పిలుస్తున్నాడు ట్రాక్టరు డ్రైవరు చెవిటిసత్యం. లేచి ముఖం కడుక్కుని ట్రాక్టరెక్కిన సుబ్బారెడ్డి మరిపోనిమ్మన్నాడు.

కొండదిగి ఎర్రకంకరదారిలోకి మళ్ళిన పెర్గ్యుసన్ ట్రాక్టరు అన్నవరం కత్తిపూడి జంక్షనూ అదీ దాటుకుంటా కాకినాడొచ్చింది. మీసాలరాజు హొటేలు ముందు ఆపిన ట్రాక్టర్లోంచి దిగిన జనం టీలు తాగుతుంటే సుబ్బారెడ్డి మట్టుకి పెరుగువడ చపాతీ కుర్మా తిని టీ తాగి

ట్రాక్టరెక్కుతుంటే మిషనుకుట్టు వెంకారెడ్డిగారి సుందరయ్య హొటేలు గోపాలరావుగారి శీనూ అలాచూస్తా ఉండిపోయేరు సుబ్బారెడ్డికేసి.

బాగా చీకటి పడ్డాకా ట్రాక్టరు ఊళ్ళో కొచ్చింది. వాళ్ళ మేడముందు దిగి లోపలికొచ్చి వేడ్నీళ్ళస్నానం చేసి కంచంముందు కూర్చున్న సుబ్బారెడ్డికి వేడిఅన్నం పెట్టి ఉప్పుచేపల ఇగురూ ఆ తర్వాత పొగలొచ్చే పప్పుచారు వేస్తుంటే అసలే ఆకల్తో ఉన్న అతను ఆవురావురు మంటా తిని ఆ తర్వాత మంచమెక్కి మాగన్ను నిదరలోంచి గాఢ నిదరలో కెళ్ళిపోయేడు.

మర్నాడు పొద్దుట సుబ్బరంగా అరాయించుకుని మామూలుగా ఉన్న సుబ్బారెడ్డి దగ్గరకొచ్చిన చిట్టి "ఏంటీ సుబ్బాడ్డీ నిన్న అంత తిన్నాకా అరుగుడు తెగులులాంటిదేం పట్టుకోలేదా నీకు?" అన్నాడు.

నవ్వేసిన సుబ్బారెడ్డి "లేదే" అన్నాడు. "నాకయితే రాత్రంతా విరోచనాలు. చాలా నీరసమొచ్చేసింది. బిళ్ళలేవన్నా రాస్తాడేమో అని మందుల అప్పన్న దగ్గర కెళ్తన్నాను" అన్నాడు.

ఈలోగా డొక్కు సైకిలేసుకొచ్చిన మల్లిడిగంగిరెడ్డి "నాకూ అలాగే ఉందది. ఇదిగో సుబ్బాడ్డీ! నువు గుండుపిక్కలాగ బానే ఉన్నావు గదా కారణమేంటి?" అన్నాడు. నవ్వేసిన సుబ్బారెడ్డి తెలీదన్నాడు. లోపల్నుంచొచ్చిన బ్రాహ్మణరెడ్డి మావోడికి పొద్దుటే బస్కీలూ, దండేలూ తియ్యడం, పరుగు లెట్టడం లాంటి అలవాట్లుకూడా లేవు ఆడి శరీరతత్వమే అంత అన్నాడు.

* * *

పెద్దోళ్ళు చూసిన సంబంధమే. మా పక్కనే ఉన్న మాచారంలో సత్తిభామిరెడ్డి గారమ్మాయిని చేసుకున్నాడు. ఆ అమ్మాయిపేరు పాప. సుబ్బారెడ్డి ఎంత నిదానమో పాప అంతకంటే నిదానం. ఒకళ్లంటే ఒకళ్ళకి చాలా ఇష్టం. వాళ్ళిద్దరూ వీధి అరుగుమీద నిలబడితే చూసే జనం ఊరిమధ్యనున్న రాములోరి గుళ్ళో సీతారాములేంటి ఇక్కడ ప్రత్యక్షమయ్యేరు అనుకుంటారు.

ఇద్దరు ఆడపిల్లలూ ఒక మగ కుర్రోడూ పుట్టేరు వాళ్ళకి.

ఒకరోజు బ్రాహ్మణరెడ్డిగారబ్బాయి రవి నడుపుతున్న బుల్లెట్టుబండి వెనకాల కూర్చుని కాకినాడ వెళ్తుంది పాప. రాంపురం నించి నరసాపురపుపేటదాకా బ్రిటీషోళ్ళ కాలం నాటి సిమ్మెంటు రోడ్డుంది. ఆరోడ్డు మీద వెళ్తున్న బుల్లెట్టు చోడవరం దగ్గర గతుకుల్లో పడి యాక్సిడెంటయ్యింది. రవికి ఏం అవ్వలేదుగానీ పాపని హాస్పిటల్లో జేర్చేరు కొన్నాళ్లపాటు ఆ హాస్పిటల్లో ఉన్న సుబ్బారెడ్డిగారిభార్యపాప ఒకరోజు కాలం చేసింది.

భార్యపోయిన సుబ్బారెడ్డికి చుట్టు పక్కలూళ్ళలో రెడ్లు మా అమ్మాయినిస్తావంటే మా అమ్మాయినిస్తామని కబుర్లెట్టేరు. రామచంద్రపురంలో కొంతమంది అందగత్తెలు వలేసి లాగే పన్నాగాలు పన్నేరు. ఎవరెంత అల్లరిచేసినా ఏమాత్రం మెత్తబల్లేదు సుబ్బారెడ్డి. చనిపోయిన ఆ తెల్లటిభార్య నవ్వు ముఖాన్ని తల్చుకుంటా ఎవరు ఎదురొచ్చి పలకరించినా కరివేరప్పువ్వులాగ నవ్వుతా ఉంటాడు. ఆవిడ చనిపోయిన రోజు మట్టుకి అదోలాగయి పోయి ఎవ్వరితోనూ మాటాడ్డు.

ఏళ్ళూ పూళ్ళూ గడుస్తున్నాయి. అలా మనసులోపల అన్ని బాధలున్నా అంత బెంగనిండి ఉన్న అతని శరీరంలోగానీ ముఖంలోగానీ ఎలాంటి మార్పూ రావడం లేదు. యవ్వనం ఏమాత్రం తగ్గడం లేదు జుట్టూ మీసాలూ నెరవలేదు. ఒకప్పట్లాగే అలాగే ఉన్నాడు.

* * *

పాతికేళ్ళు గడిచి పోయినియ్యి.

కొడుకూ కూతుళ్ళూ పెద్దోళ్లయ్యేరు. ఇప్పుడు సుబ్బారెడ్డికి ఏభైయ్యేళ్ళ వయసొచ్చింది. అదేంటో విచిత్రం ఒకప్పుడెలాగున్నాడో

ఇప్పుడూ అలాగే ఉన్నాడు. జుట్టూ గెడ్డం తెల్ల వెంట్రుకల్తో పండలేదు. ముఖంలో ఆ అందం ఏమాత్రం చెక్కు చెదర్లేదు. ఇసుమంతైనా వాడని నవనవలాడే శరీరంలో ఒకప్పట్లాగే ఉన్నాడు. కానీ, అదే తిండి, అదే తీరు, అదే నవ్వు.

ఆరోజు ఇద్దరు కూతుళ్ళతో పాటు కాకినాడ వెళ్ళిన సుబ్బారెడ్డితో వాళ్ళ పెద్దమ్మాయి "నాన్నగారూ..ఒంటి మిరియం గాజులు కావాలి నాకు" అంది. "పదండి కొట్లోకి నచ్చినియ్యి తీసుకుందాం" అన్నాడు.

అంతా గిల్ట్ బంగారం కొట్లో కెళ్ళేరు. షాపోళ్ళు రామచంద్రపురం రాజుగారి ఆర్టోసు కూల్ డ్రింకులు తెప్పించేరు. ఒక పక్క బేరం జరుగుతుంది. పెద్దమ్మాయి పక్కన నిలబడి ఉన్న సుబ్బారెడ్డిని పని గట్టుకుని చూస్తున్న షాపులో మనిషి "పాపగారూ... ఈఁరెవరండీ ... మీ మాయ్యగారా..మీ ఇద్దరిదీ మంచి జోడా అండీ" అన్నాడు.

అది విన్న సుబ్బారెడ్డిగారి పెద్దమ్మాయికి కాస్సేపు ఊపిరాడలేదు. ప్రాణం జిల్లార్చుకు పోయినట్టయ్యింది.

ఇంటికొచ్చేకా ఆరాత్రి భోజనాల దగ్గర చెల్లెల్తో "ఇంకెప్పుడూ నాన్నగారి కూడా బయటి కెళ్ళగూడదు మనం" అనేసింది పెద్దమ్మాయి.

కొన్నాళ్ళకి పిల్లలందరికీ పెళ్ళిళ్ళయినియ్యి ఏళ్ళు గడుస్తున్నాయి. సుబ్బారెడ్డిలో మాత్రం ఏ ముసలరకం రాకుండా అందంగా అలాగే ఉన్నాడు.

* * *

సుబ్బారెడ్డిగారి అన్నగారు బ్రాహ్మణరెడ్డిగారు చనిపోయేరు. ఇంటి బరువంతా నెత్తి మీద పడ్డ సుబ్బారెడ్డి రాత్రీ పగలూ కష్టపడ్తున్నాడు.

పెద్దల్లుడు చనిపోయేడు..పెద్దకూతురు కొడుకు రెండంతస్తుల గాలి మేడ మీంచి పడిపోయేడు... తనకి చాలా ఇష్టమైన పెద బావమరిది శేషారెడ్డి కాకినాడెళ్తా యాక్సిడెంటులో పోయేడు... ఆస్తి పంపకాలు జరిగిపోయినియ్యి. అన్ని దెబ్బలు తగిలినా, అన్ని బాధలు కలిగినా ప్రతీరోజూ ఏడ్చి బెంగెట్టుకుని కుళ్ళిపోయి ఏడ్చే రోజు లొచ్చినా చింతా సుబ్బారెడ్డి, మనసులో గానీ, ముఖంలోగానీ, శరీరంలోగానీ ఎలాంటి మార్పు రావడం లేదు. పరమ ప్రశాంతంగా పాపికొండల మధ్య మునీశ్వరుడి ఆశ్రమం లాగ, రాజమండ్రికీ ధవిళేశ్వరం ఆనకట్టకీ మధ్య నిండుగా పరవళ్ళు తొక్కుతా ప్రవహించే అఖండగోదావరి లాగా, మా రాజేశ్వరస్వామి గుళ్ళో మంచు పడ్తున్నప్పుడు పూచిన నందివర్ధనం పువ్వులాగ ఉన్నాడు. ఒక పక్క సుబ్బారెడ్డి తోటివాళ్ళంతా ముసలోళ్ళయి పోతున్నారు. ఏంటీ మనిషిలో రహస్యం ఏంటా పరవశివుడి మాయ బుర్ర ఎంత బద్దలు గొట్టుకున్నా ఏ మాత్రం అర్థం గావటం లేదు పసలపూడి జనాలకి.

* * *

వూరి చివర ఎర్రమట్టి గోతుల దగ్గరుండే కల్లు పద్దాలు చెల్లెలు సుబ్బాలు చాలా అందగత్తె. దాలిగుంటలో మరగ్గాచిన పాలరంగులో ఎర్రగా ఉంటది శరీరం. పాత సినేమాల్లో వెన్నిరాడై నిర్మల్లాగుంటది మనిషి. అలాంటి సుబ్బాలు పెళ్ళి చేసుకోకుండా చాన్నాళ్ళనించి అలాగే ఉండిపోయింది. ఎప్పుడు జూసినా వాళ్ళ నాలుగునిట్రాళ్ళ పాక చూరు కింద కూర్చుని ఉండే ఆ మనిషి ఎవరో వస్తారక్కడికి అనేసి ఎదురుచూస్తా ఉంటుంది. ఎన్నో ఏళ్ళనించి అలాగే ఉండిపోయిన సుబ్బాలుకి ఆ మనిషి ఇంక రాడని తెల్సిపోయింది. పొద్దుటే ఎవరూ చూడకుండా ఆ మనిషిఫొటోకి పూజ చేసుకుని ట్రంకుపెట్టి అడుగున దాచుకునే సుబ్బాలు ఆవేళ బయటికి తీసి ఆ ఫొటోనే పెళ్ళి చేసేసుకుంది. అది అందమైన సుబ్బారెడ్డి ఫొటో.

ఈ వార్త పసలపూడి వూళ్ళోకి పాకింది. సుబ్బారెడ్డికి కూడా తెల్సింది.

* * *